# రేపు కండ్లకోయకు సీఎం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మేడ్చల్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 9న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో సీఎం రేవంత్ రెడ్డి స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ జోయెల్ డెవీస్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.



కండ్లకోయలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 హైదరాబాద్, శుక్రవారం 8 మార్చి 2024 HYDERABAD


# బల్కంపేట ఎల్లమ్మకు రూ.4.4 కోట్లు

- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేటాయింపు
- వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి

అమీర్‌పేట్, మార్చి 7 : స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకంలో భాగంగా రూ.1400 కోట్ల వ్యయంతో దేశ వ్యాప్తంగా 52 పర్యాటక ప్రాజెక్టులను మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇందులో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధికి రూ.4.4 కోట్లు కేటాయించారు. గురువారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన స్క్రీన్ ద్వారా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆలయంలో అన్నదాన భవనం, వర్షపు నీటి సంరక్షణ, వరదనీటి పైపులైన్ల వ్యవస్థ, బయో టాయిలెట్స్, ఆలయ ప్రహరీగోడలు, గేట్లు, సీసీ టీవీ కెమెరాలు, సైనేజెస్, డీజే సెట్ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి, మహంకాళి (సికింద్రాబాద్) జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ, దేవాలయ ఈవో నాగరాజు, ఆలయ చైర్మన్ సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడే మహా శివరాత్రి

ముస్తాబైన ఆలయాలు

సిటీబ్యూరో, మార్చి 7 ( నమస్తే తెలంగాణ ) : మహా శివరాత్రి సందర్భంగా నగర వ్యాప్తంగా దేవాలయాలన్ని ముస్తాబయ్యాయి. భక్తులు వేకువ జాము నుంచే దేవాలయాలకు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగుట్ట జాతరకు తరలి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. రెజిమెంటల్ బజార్, అమ్ముగూడ, యాప్రాల్, ఈసీఐఎల్ బస్టాప్‌ల నుంచి కీసరగుట్టకు, సీబీఎస్, పటాన్ చెరు నుంచి ఏడుపాయల జాతరకు బస్సులు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

## 24 నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు

తాజాగా మరికొంత మందికి షోకాజ్ నోటీసులు

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : నాన్ అవైలెబులిటీ సర్టిఫికెట్ లేకుండానే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లను జారీ చేసిన ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యల పరంపర కొనసాగుతున్నది. ఫలక్‌నుమా సర్కిల్‌లో నాన్ అవైలెబులిటీ సర్టిఫికెట్ లేకుండా దాదాపు 80 సర్టిఫికెట్లు జారీ అయినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు 24 సర్టిఫికెట్లు నిబంధనలకు విరుద్ధంగా జారీ అయినట్లు గుర్తించారు. ఇందులో భాగంగానే సర్కిల్‌లో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేశారు. తాజాగా శుక్రవారం రిజిస్ట్రార్, ఏఎంసీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ పరిధిలోని 31 సర్కిళ్లలో విచారణ జరుగుతున్నది.

జేబీఎస్ టూ.. శామీర్‌పేట

# సాఫీగా సాగిపోయేలా..

- ఫలించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రయత్నం
- ఎలివేటెడ్ కారిడార్ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- దశాబ్దాల వెతలు తీర్చనున్న ఎలివేటెడ్ కారిడార్
- రాజీవ్ రహదారిలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- కరీంనగర్, మంచిర్యాల సహా ఆరు జిల్లాలకు ప్రయోజనం



సిటీబ్యూరో, (నమస్తే తెలంగాణ) / కంటోన్మెంట్/బొల్లారం, మార్చి 7 : ఉత్తర తెలంగాణలోని ఆరు జిల్లాల ప్రజల దశాబ్దాల కల, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రయత్నం త్వరలోనే సాకారం కానున్నది. హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు రాకపోకలు సాగించేందుకు ఇన్నాళ్లు జనం పడిన కష్టాలు తీరిపోనున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో ఇరుకైన రహదారిలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు రూ.2,232 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం రేవంత్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయితే ఆరు జిల్లాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గిపోవడంతో ఇంధన రూపంలో వ్యయం తగ్గిపోనున్నది. ఉత్తర తెలంగాణలోని జిల్లాలకు బస్సులు బయలుదేరే జేబీఎస్ నుంచి ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు కంటోన్మెంట్ ప్రాంతం ఉండడంతో ఆ ప్రాంతంలో రహదారుల విస్తరణకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. కంటోన్మెంట్ ప్రాంతంలోని భూములు రక్షణ శాఖ పరిధిలోనివి కావడం, వాటి బదలాయింపునకు ఆ శాఖ సుముఖంగా లేకపోవడంతో ఈ రహదారుల విస్తరణపై గత ప్రభుత్వం చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణంగా నేడు ఫలితం సఫలీకృతమైంది. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములు తమకు అప్పగించాలని, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం అంగీకరిస్తూ మార్చి ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి నడుంబిగించింది.

### ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ఇలా...

సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొదలై వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూంకుంట మీదుగా శామీర్‌పేట్ సమీపంలోని ఓఆర్‌ఆర్ జంక్షన్ వద్ద ముగుస్తుంది. ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా తిరుమలగిరి జంక్షన్ సమీపంలో (0.295 కి.మీ. వద్ద), (0.605 కిలోమీటర్ వద్ద), అల్వాల్ వద్ద (0.310 కిలోమీటర్ వద్ద) మొత్తంగా మూడు చోట్ల ఇరువైపులా ర్యాంపులు నిర్మిస్తారు.



### ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో ప్రయోజనాలు

ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో రోజుకు సగటున 58,468 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ ఫర్ డే – పీసీయూ) ప్రయాణిస్తున్నాయి. ఇందులో కార్ఖానా సమీపంలో పీసీయూ 81,110 వద్ద ఉండగా, ఓఆర్‌ఆర్ జంక్షన్ సమీపంలో 35,825గా ఉంది. అసలే ఇరుకైన రహదారి.. ఇంత పెద్ద మొత్తంలో వాహనాల రాకపోకలతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు, ప్రయాణికులు హడలిపోతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో సమయం కలిసిరావడంతో పాటు ఇంధనంపై అయ్యే వ్యయం తగ్గిపోతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ బాధలు తొలగిపోతాయి.

### కారిడార్ వివరాలు

- మొత్తం కారిడార్ పొడవు: 18.10 కి.మీ.
- ఎలివేటెడ్ కారిడార్ పొడవు: 11.12 కి.మీ.
- అండర్‌గ్రౌండ్ టన్నెల్: 0.3 కి.మీ.
- పియర్స్ : 287
- అవసరమైన భూమి : 197.20 ఎకరాలు
- రక్షణ శాఖ భూమి : 113.48 ఎకరాలు
- ప్రైవేట్ ల్యాండ్ : 83.72 ఎకరాలు
- ప్రాజెక్టు వ్యయం : రూ.2,232 కోట్లు

### రాజీవ్ రహదారిలోని జిల్లాలు..

- మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, కొమురం భీం జిల్లా ప్రజలు ఈ రహదారితో లబ్ధిపొందనున్నారు.

### వుయ్ డిమాండ్ మేడ్చల్ మెట్రో..

భూమి పూజ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే వుయ్ డిమాండ్ మేడ్చల్ మెట్రో అంటూ మెట్రో సాధన సమితి సభ్యులు నినదించారు. బహుళ ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టులను చేపట్టాల్సిన ప్రభుత్వం ప్రచార ఆర్భాటంగా భూమి పూజ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ అధికారులు ప్రదర్శించిన ప్రాజెక్టు వివరాలపై సాధన సమితి సభ్యులు మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వలన భవిష్యత్తులో మెట్రో విస్తరణ సాధ్యపడదని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ రెండు కారిడార్లలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి హయాంలో... కేవలం డిఫెన్స్ శాఖ నుంచి భూములను తీసుకున్నామని చెప్పుకోవడానికే అన్నట్లుగా.. ఎలివేటెడ్ కారిడార్ భూమి పూజ హడావుడిగా మొదలుపెట్టిందన్నారు.

### ప్రాజెక్టుతో ప్రయోజనాలు

- రాజీవ్ రహదారి మార్గంలో సికింద్రాబాద్‌తో పాటు కరీంనగర్ వైపు జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.
- కరీంనగర్ వైపు మెరుగైన ప్రయాణ సదుపాయం
- ఇంధనం మిగులుతో వాహనదారులకు తగ్గనున్న వ్యయం
- నగరం నుంచి ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా ఓఆర్‌ఆర్ వరకు చేరుకునే అవకాశం

## పది లక్షలు డ్రా చేస్తే.. సమాచారం ఇవ్వండి..!

- అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై దృష్టి పెట్టండి
- ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి చెక్‌బుక్ జారీ చేయాలి
- గత మూడు నెలలకు సంబంధించి నగదు లావాదేవీల నివేదికను ఇవ్వాలి
- బ్యాంక్ కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ బ్యాంకర్లను కోరారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్, పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంక్ కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు కో ఆర్డినేటర్లకు, నగదు రవాణా ఏజెన్సీలకు ఎన్నికల నియమావళి, నగదు రవాణా మార్గదర్శకాలను వివరించారు. ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత ఎన్నికలకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నగదు రవాణాలో సరైన ఆధారాలు లేని ఏజెన్సీలు, బ్యాంకు కో -ఆర్డినేటర్స్ వాహనాలను సీజ్ చేసే అధికారం ఉన్నందున అధికారిక అనుమతి పత్రాలతో బ్యాంకు నుంచి ఏటీఎంలకు నగదు రవాణా తదితర అంశాలను వివరించారు. 10 లక్షలకు పైబడి నగదు, ట్రాన్స్‌ఫర్ చేసినా వాటి వివరాలను, ఏటీఎం, యూపీఐ లావాదేవీలపై ఆయా బ్యాంకు అధికారులు అందించాలని ఎన్నికల అధికారి కోరారు. ముఖ్యంగా గత మూడు నెలలకు సంబంధించి నగదు లావాదేవీల నివేదికను బ్యాంకు బ్రాంచ్ వారీగా ఇవ్వాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కొత్తగా కరెంట్ అకౌంట్ ఓపెన్ చేస్తారని, జాప్యం చేయకుండా వెంటనే చెక్ బుక్ జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, ఆర్‌బీఐ మేనేజర్ అంకిత్‌అగర్వాల్, ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర, వివిధ బ్యాంకుల కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రొనాల్డ్‌రాస్



నెక్నాంపూర్ పెద్దచెరువులో..

# అక్రమ విల్లాలు కూల్చివేత

- స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్
- చెరువులో లేక్ వ్యూ పేరిట వెలిసిన విల్లాలు కూల్చివేత
- ఇప్పటికే ఒక్కో విల్లా రూ.20-25 కోట్లకు విక్రయం
- సీఎం సోదరుడి మద్దతు ఉన్నది.. నీ అంతు చూస్తా..
- తహసీల్దార్‌ను హెచ్చరించిన బిల్డర్
- ఉద్రిక్తంగా మారిన నెక్నాంపూర్ ఆక్రమణల తొలగింపు

మణికొండ, మార్చి 7 : లేక్ వ్యూ పేరిట నిర్మాణాలు చేస్తున్న ఓ బిల్డర్ అక్రమాల పుట్టను స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు గురువారం తెల్లవారుజామున కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ గ్రామ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ బిల్డర్ సుమారు 10 విల్లాలను ఎలాంటి అనుమతులు లేకుండా 'లేక్ వ్యూ' పేరిట చేపట్టారు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి మద్దతుతో ఈ అక్రమ నిర్మాణాలకు ఊతం పోస్తున్నారు. ఒక్కో విల్లాను సుమారు రూ.20–25 కోట్లకు విక్రయిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించారు. గురువారం గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నాలుగు విల్లాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా లేక్ వ్యూ నిర్మాణదారుడు పల్లపు గోవర్ధన్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో వాగ్వివాదానికి దిగారు. నేను ఎవరో తెలుసా... సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం అంతా నాకు క్లోజ్.. నేను తలచుకుంటే నిన్ను గంటలో ఇక్కడ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని చిటికెలు వేస్తూ దబాయించారు. దీంతో తహసీల్దార్, గోవర్ధన్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురిని సముదాయించి నాలుగు విల్లాలను పాక్షికంగా కూల్చి వేసి రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు.

### అక్రమ నిర్మాణదారులపై కేసులు నమోదు చేస్తాం : తహసీల్దార్

నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాల కూల్చివేతలు ఆపే ప్రసక్తే లేదని, నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విలువైన సర్కార్ భూమిని ఆక్రమించి యథేచ్ఛగా విల్లాలు నిర్మించడం, ఆపై ప్రభుత్వ పెద్దల పేర్లు చెప్పి దబాయించడం సరికాదన్నారు. సర్కార్ భూముల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# కక్ష గట్టి .. కూల్చివేత



అడ్డుకున్న విద్యార్థులు, స్వల్ప ఉద్రిక్తం

- ఐఏఆర్‌ఈ కళాశాల భవనం కూల్చివేత
- పాల్గొన్న రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు
- ఎమ్మెల్యేల ఫోన్లకు స్పందించని కలెక్టర్
- ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల అక్రమనిర్మాణాల సంగతి తేల్చండి : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ
- 1995లోనే 50 ఎకరాలు కొనుగోలు చేశాం
- గత 25 ఏండ్ల క్రితం చంద్రబాబు హయాంలోనే.. కళాశాల భవనాలను నిర్మించాం
- క్రమబద్ధీకరణకు రూ.95 లక్షలు చెల్లించాం
- ప్రతి ఏడాది రూ.15లక్షల ఆస్తిపన్ను చెల్లిస్తున్నాం
- స్టాండింగ్ కమిటీ కమిషనర్ చెప్పినా వినలేదు
- విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

దుండిగల్, మార్చి 7 : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలే టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపట్టారనే నెపంతో ఇంజినీరింగ్ కళాశాల భవనాలను కూల్చివేతకు శ్రీకారం చుట్టింది. అధికారులు సైతం ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లుగానే నడుచుకుంటున్నట్లు స్పష్టమవుతున్నది. గురువారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన కూల్చివేతలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దుండిగల్‌లోని చిన్నదామర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఐఏఆర్‌ఈ కళాశాల యాజమాన్యం అక్రమంగా నిర్మాణాలను చేపట్టారనే నెపంతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు.

### ఉదయం నుంచే కూల్చివేతలు

చిన్నదామర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల ఆక్రమణలకు సంబంధించి ఇటీవల హైకోర్టు అడ్వకేట్ కమిటీతో పాటు జిల్లా కలెక్టర్ పరిశీలన జరిపిన నేపథ్యంలో కూల్చివేతలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దుండిగల్‌లోని ఐఏఆర్‌ఈకు చెందిన ఓ బహుళ అంతస్థుల భవనాన్ని కూల్చివేసేందుకు ఉదయం పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలతో రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు అక్కడకు చేరుకున్నాయి. భవనాల కూల్చివేతలకు పలు బ్రేకర్లు, జేసీబీలను వినియోగించారు. గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తాన్ని కూల్చివేశారు.

### అడ్డుకున్న విద్యార్థులు.. పరిస్థితి ఉద్రిక్తం

కూల్చివేతలు జరుగుతున్న సమయంలో విద్యార్థులు ఒక్కసారిగా సంఘటనా స్థలానికి దూసుకువచ్చి జేసీబీలకు అడ్డుగా నిలిచారు. ఓ వైపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా కూల్చివేతలు చేపట్టడం ఏమిటని నిలదీస్తూ కూల్చివేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు అధికారులు కూల్చివేతలను నిలిపివేశారు. అనంతరం కళాశాల తరగతులకు సెలవు ప్రకటింపజేసి విద్యార్థులను అక్కడి నుంచి పంపించారు. మరోవైపు అప్పటికే అక్కడికి కళాశాల యజమాని, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు చేరుకున్నారు. అనంతరం గడువు కోరేందుకు అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఇంతలో మరోసారి అధికారులు పోలీసుల బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టారు. భవనం రెండో అంతస్థును కూల్చివేశారు.

### లంచ్‌మోషన్ పిటీషన్‌తో ఆగిన కూల్చివేతలు

కళాశాల యాజమాన్యం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటీషన్ దాఖలు చేయడంతో పరిశీలించిన హైకోర్టు జడ్జి తాత్కాలికంగా కూల్చివేతలను నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు కూల్చివేతలు చేపట్టవద్దని జడ్జి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తున్నది.

### ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలు : ఎమ్మెల్యేలు

రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలనను మరిచిందని, సంక్షేమం, అభివృద్ధి అసలే పట్టించుకోకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద్ అన్నారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు మీడియాతో మాట్లాడుతూ దొంగహామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్ పార్టీ నేతలను టార్గెట్ చేసుకుని లేనిపోని అభూత కల్పనలను సృష్టించి ప్రజలను మభ్యపెడుతుందని మండిపడ్డారు. ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేయించి బెదిరింపులకు దిగుతుందని ధ్వజమెత్తారు. తాము ఆక్రమణలను సమర్థించడం లేదని, ఏది ఉన్నా పద్ధతి ప్రకారం చేయాలని తెలిపారు. సోమవారం వరకు కూల్చివేతలు చేపట్టవద్దని స్టాండింగ్ కమిటీ చెప్పినప్పటికీ ఆగమేగాల మీద కూల్చివేతలు చేపట్టడమేమిటని ప్రశ్నించారు. కూల్చివేతల నిలుపుదల కోసం తాము జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెలితే ఆయన అందుబాటులోకి రాకపోవడం సరికాదని అన్నారు. కలెక్టర్ తమ ఫోన్ ఎత్తకుండా.. కూల్చివేతలు చేపడుతున్న అధికారులతో మాత్రం టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడా అక్రమనిర్మాణాలు చేపట్టలేదా..? వాటి సంగతి ఏమిటీ? వాటిని ఎప్పుడు కూల్చుతారంటూ ప్రశ్నించారు. గడిచిన 30 ఏండ్లుగా జాతీయ, అంతర్జాతీయస్థాయి ఇంజినీర్లను తయారు చేస్తున్న ఐఏఆర్‌ఈ కళాశాలకు అధికారుల నుంచి ఏనాడు ఒక్క నోటీస్ కూడా అందలేదని, కానీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడు నెలలైనా కాకముందే కక్ష సాధింపుచర్యలకు దిడగం మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వ వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



## మేము ఎక్కడ భూములను ఆక్రమించలేదు

ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 1995లోనే 50 ఎకరాలు కొనుగోలు చేశాం. గత 25 ఏండ్ల క్రితమే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడే అనుమతులు పొంది కళాశాల భవనాలను నిర్మించి నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నాం. పంచాయతీల నుంచి హెచ్‌ఎండీఏ పరిధిలోకి వెళ్లిన క్రమంలో భవనాల క్రమబద్ధీకరణ కోసం 2015లోనే రూ.95 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని చెప్పారు. తాము ఎక్కడా ప్రభుత్వ భూములను ఆక్రమించలేదని, తాము కొనుగోలు చేసిన పట్టా భూముల్లోనే కళాశాల భవనాలన్నీ నిర్మించినట్లు స్పష్టం చేశారు. వారం కిందట తమకు నోటీసులు ఇవ్వగా దానికి తాము సమాధానం ఇచ్చామని, అయినప్పటికీ కూల్చివేతలు చేపట్టారని తెలిపారు. ఇదే విషయమై కలెక్టర్‌ను కలిసి కోర్టు ద్వారా పరిష్కరించుకుంటామని తెలియజేసేందుకు వెళితే ఆయన అందుబాటులోకి రాకపోగా మరిన్ని యంత్రాలతో కూల్చివేతలను తీవ్రతరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రభుత్వం మాపై కక్ష గట్టినందునే ఈ చర్యలకు దిగిందన్నారు. తాము కళాశాల నిర్మించినప్పటి నుంచి ప్రతి ఏడాది రూ.15లక్షల ఆస్తిపన్ను చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. జడ్జి ఆదేశాల మేరకు స్టాండింగ్ కమిటీ కమిషనర్ మధ్యాహ్నం 12గంటలకు కూల్చివేతలు ఆపాలని అధికారులకు తెలిపినా ఉద్దేశ్యపూర్వకంగానే సాయంత్రం 5 గంటల వరకు అధికారులు కూల్చివేతలు చేపట్టడం సరికాదన్నారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ అన్యాయంగా కూల్చివేతలు చేపడుతున్నారని, వెంటనే ఆపివేయాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలిసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విన్నవించారు.